౨. కథలు

# కాంగ్రెస్ కొఱకు తండ్రినివీడిన బాలవీరుడు

లవణసత్యాగ్రహసందర్భమున వడాలా సాల్టు డిపోపై దాడిసల్పిన ముప్పది అర్గురు సత్యాగ్రహులు మే 18-వ తేదీని అరెస్టుగావింపబడిరి. వారివిచారణ మెజాగన్ పోలీసుకోర్టులో గావింపబడెను. ఆ సత్యాగ్రహులలో నొకబాలవీరు డుండెను. అతడు కాంగ్రెస్ కొఱకు వృద్ధుడగు తనతండ్రినికూడ విడనాడెను. కాంగ్రెస్ జూబిలీ ఉత్సవ వారసందర్భమున దేశభక్తుడగు ఆబాలవీరునికథ ఈబాలబాంధవిద్వారా ఆంధ్రభూమియందలి బాలపాఠకులజ్ఞప్తికి ఎలయించుచున్నాము.

విచారణకర్త మేజిస్ట్రేట్ యన్. టి. జన్గల్‌వల్లా కోర్టుతీర్చియుండెను. అట్టి సమయమున వృద్ధుడగు నొకమహారాష్ట్రుడు కోర్టుహాలులోనికిజొరబడి మేజిస్ట్రేట్‌నకు నమస్కరించి ఇట్లు చెప్పెను: 'మహాప్రభూ? అరెస్టు చేయబడి తమ ఎదుట విచారణకు నిలబెట్టబడియున్న సత్యాగ్రహులలో నా కుమారుడు ఉన్నాడు. వానిని తీసికొనిపోవుటకు నేనిచటకు వచ్చితిని.'

అందుమీద మేజిస్ట్రేట్ ఆముసలిని ఆతనికొడుకును చూపించవలసినదిగా చెప్పెను. ఆసత్యాగ్రహుల నడుమనుండి ఒక బాలుడు ముందుకువచ్చి నిలిచెను. తన పేరు త్రియంబకు విఠల్ అని చెప్పెను.

తనతండ్రితో ఇంటికిపోవుటకు తనకు ఇష్టమేనా అని ఆబాలుని మేజిస్ట్రేట్ ప్రశ్నించెను.

దానికి ఆబాలుడు తన అసమ్మతిని ప్రకటించెను. తనతండ్రి దిక్కుమొగమై అత డిట్లు చెప్పెను. 'పితృదేవా! మీరు మహారాష్ట్రులు. పూర్వమహారాష్ట్రవీరులను జ్ఞప్తికి తెచ్చుకొనుడు.'

మేజిస్ట్రేటు వృద్ధునిచూచి 'నిన్ను ఎవరు పోషించుచున్నారు?' అని ప్రశ్నించెను.

తన తనయుని వ్రేలితో చూపుచు ఆవృద్ధుడు ఇట్లు చెప్పెను: 'ఇతడు తప్ప నన్నుపోషించువారు ఎవ్వరునులేరు, ఇతడు నాఏకైకపుత్రుడు.'

అంతట మేజిస్ట్రేటు బాలునివైపునకుతిరిగి 'వృద్ధుడగు నీయీ తండ్రిని పోషించుట నీవిధ్యుక్తధర్మము.' అని వచించెను.

దానికి ఆ బాలు డిట్లు బదులు చెప్పెను. 'ఇంతదనుక నేను నాతండ్రిని లెస్సగ పోషించితిని. ఇపుడు నేను నాదేశమును సేవింపవలసియున్నది. కావున ఇపుడు నేను కారాగారమునకే పోవుదును.'

తనకొమారుని ఈమాటలు విని ఆముసలివాడు కంటనీరు పెట్టుకొనెను, అయినను ఆ బాలుడు చలింపలేదు. దేశభక్తిచే ఆవేశింపబడిన ఆబాలునకు చిల్లరబాంధవ్యములు గణనకురాలేదు. కాంగ్రెస్ కొఱకు తండ్రినివీడి ఆబాలుడు ఒక వీరుడయ్యెను.

# అన్యమతస్వీకరణకారణం

నారాయణసింగ్ అక్బర్‌పూర్ అనే గ్రామానికి జమీందారు. తక్కువజాతివారంటె, అందులో ముఖ్యంగా మాలలంటే బహు అసహ్యం. వాళ్లెక్కడైనా కనబడితే చాలు తిరస్కారంగా చూసేవాడు. ఇట్టి జమీందారుకు అప్పుడు అనే చెప్పులుకుట్టేవాడు నౌకరైతు